Digital, tmedia.net.in

# టీ-మీడియా

TMEDIA 11వ వార్షికోత్సవం 2016 - 2026
నిజం మా లక్ష్యం... ప్రజలే మా శక్తి...
మీ ఆదరణ... మా ప్రేరణ... ధన్యవాదాలు!

tmedia.net.in
సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 8
సంచిక :336
పేజీలు : 5

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

మంగళవారం ఆగస్టు 04, 2026 టీమీడియా మెయిన్ ఎడిషన్ ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

# బీజేపీ కంచుకోట బద్దలు?

## ● బాంకీపుర్‌లో ప్రశాంత్ కిశోర్ ఘన విజయం
## ● నితిన్ నబీన్ రాజీనామా వల్ల ఖాళీ అయిన స్థానం




**టి మీడియా , ఆగస్టు 3 , ఢిల్లీ బ్యూరో:**
బిహార్?లో బీజేపీకి గట్టి షాక్ తగిలింది. స్వయానా బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితీన్ నబీన్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసిన స్థానంలోనే ఆ పార్టీ పరాజయం పాలైంది. నితిన్ నబీన్ రాజీనామాతో ఖాళీ అయిన బాంకీపుర్ అసెంబ్లీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో ఎన్నికల వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిషోర్ విజయం సాధించారు. బీజేపీ అభ్యర్థి నీరజ్ కుమార్ పై గెలుపొందారు. ప్రశాంత్ కిషోర్ విజయంతో జన్ సురాజ్ పార్టీ కార్యాలయంలో సందడి వాతావరణం నెలకొంది. పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున కార్యాలయానికి చేరుకొని సంబరాలు జరుపుకున్నారు. గత ఏడాది నవంబర్?లో జరిగిన బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో జన్ సురాజ్ పార్టీ ఒక్క సీటు కూడా గెలుచుకోలేదు. ప్రశాంత్ కిషోర్ విజయంతో ఆ పార్టీలో నెలకొన్న నైరాశ్యాన్ని ఈ తాజా ఫలితం పటాపంచలు చేసింది.ఉప ఎన్నికల ఫలితాలపై మాట్లాడిన ప్రశాంత్ కిషోర్ బాంకీపూర్ ప్రజలు బీజేపీ నాయకత్వానికి ఒక స్పష్టమైన సందేశాన్ని పంపారని చెప్పారు. నేర చరిత్ర కలిగిన వ్యక్తి బిహార్?ను పాలించడాన్ని ప్రజలు ఏమాత్రం కోరుకోవడం లేదని వెల్లడించారు. విద్యావ్యవస్థను మెరుగుపరిచి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ, బిహార్ బిడ్డలు ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన అవసరం లేకుండా చూసే ఒక మంచి ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని ప్రశాంత్ కిషోర్ వెల్లడించారు. తమ పోరాటం వ్యక్తులపై కాదని వ్యవస్థలపై మాత్రమే అని ప్రశాంత్ కిషోర్ స్పష్టం చేశారు.స్వతహాగా వ్యూహకర్త అయిన ప్రశాంత్ కిశోర్ తన వ్యూహాలకు మరింత పదును పెట్టారు. ప్రజలతో మమేకమవ్వడానికే అధిక ప్రాధాన్యం ఇస్తూ ముందుకు సాగారు. ఈ క్రమంలో అధికార పార్టీలో ఉన్న విభేదాలు తనకు అనుకూలంగా మార్చుకోవడంలో సఫలీకృతమైన పీకే బీజేపీ కంచుకోటలో విజయం సాధించారు. 1995 నుంచి బాంకీపూర్ అసెంబ్లీ నియోజకవర్గం బీజేపీకి కంచుకోటగా మారింది. అక్కడ జరిగిన ఎన్నికల్లో ప్రతిసారీ బీజేపీదే పూర్తి ఆధిపత్యం. అలాంటి కమలదళం కంచుకోటను ప్రశాంత్ కిషోర్ బద్దలుకొట్టారు.

### మంజల్‌పుర్‌లో బీజేపీ అభ్యర్థి విజయం

మరోవైపు, గుజరాత్‌లోని మంజల్‌పూర్, మధ్యప్రదేశ్‌లోని దతియా అసెంబ్లీ స్థానాలకు కూడా ఉప ఎన్నికలు జరిగాయి. మంజల్‌పూర్ ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి సతీశ్ పటేల్ విజయం సాధించారు. కాంగ్రెస్ తరఫున బరిలోకి దిగిన బికాభాయ్ రబారీపై 30 వేల పైచిలుకు ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. బీజేపీ ఎమ్మెల్యే యోగేశ్ పటేల్ ఆకస్మిక మరణంతో ఆ స్థానం ఖాళీ కాగా తాజాగా ఉప ఎన్నిక నిర్వహించారు. అటు దతియా అసెంబ్లీ స్థానాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకుంది. ఆ పార్టీ అభ్యర్థి ఘనశ్యామ్ సింగ్ విజయం సాధించారు. ప్రత్యర్థి, బీజేపీ అభ్యర్థి అశుతోష్ తివారీపై 6,016 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఉన్న రాజేంద్ర భారతికి ఓ మోసం కేసులో ఏప్రిల్‌లో దిల్లీ కోర్టు మూడేళ్ల జైలు శిక్ష విధించింది. దీంతో ఆయన శాసనసభ సభ్యత్వం రద్దవడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది.

# ఈ ఏడాది కుంభవృష్టి వర్షాలు

## భవిష్యవాణి వినిపించిన మాతంగి స్వర్ణలత



**టీమీడియా, ఆగస్టు 3, హైదరాబాద్ బ్యూరో :**
ఈ ఏడాది కుంభవృష్టి వర్షాలు కురుస్తాయని మాతంగి స్వర్ణలత తెలిపారు. సికింద్రాబాద్? ఉజ్జయిని మహంకాళి బోనాల (లష్కర్?) ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన రంగం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మాతంగి స్వర్ణలత భవిష్యవాణి వినిపించారు. కుంభవర్షాలతో ప్రజలు కొట్టుకుపోయే పరిస్థితి ఉందని ప్రాణనష్టం, అగ్ని ప్రమాదాలు సంభవిస్తాయని హెచ్చరించారు. వావివరసలు లేకుండా జనాలు ప్రవర్తిస్తారని భవిష్యవాణిలో మాతంగి స్వర్ణలత తెలిపారు.

### వరదలు, అగ్నిప్రమాదాలతో జాగ్రత్త

తన విగ్రహ ప్రతిష్ఠ చేస్తామన్నారు కానీ చేయటం లేదని, అందరినీ కాపాడుతున్నాను కానీ తన మాటను ఆచరించడం లేదని మాతంగి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ విషయం తనకు ఆగ్రహాన్ని కలిగిస్తుందన్నారు. ఎవరు అడ్డొచ్చినా విగ్రహ ప్రతిష్ఠ చేయించుకుని తీరుతానన్నారు. ఈ ఏడాదిలో కుంభవృష్టి వర్షాలు ఉన్నాయని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. వరదల్లో కొట్టుకుపోయే అవకాశం ఉందని భవిష్యవాణి వినిపించారు. ప్రాణనష్టం కూడా జరుగుతుందన్నారు. అగ్ని ప్రమాదాలు సైతం ఉన్నాయని వివరించారు.

### 6 నెలల్లో విగ్రహం ప్రతిష్ఠించకపోతే ప్రాణనష్టం

వావి వరసలు మరిచి ఘోరాలు చేస్తారని, సంతోషమనేది లేకుండా చేస్తున్నారని మాతంగి స్వర్ణలత భవిష్యవాణి వినిపించారు. బాల బచ్చలను కాపాడుకుంటానని అభయమిచ్చారు. ఈ ఏడాది బాగా నిరుత్సాహపరిచారన్నారు. మనసు తృప్తి లేకుండా చేస్తున్నారని మాతంగి స్వర్ణలత తెలిపారు. తాను దోసెడంత కల్పిస్తున్నా, తనకు మాత్రం గోరంత చేయలేకపోతున్నారని అన్నారు. కోరిందల్లా కొంగు బంగారం చేస్తానని, తన విగ్రహ ప్రతిష్ఠ చేయాలన్నారు. 6 నెలల్లో విగ్రహం ప్రతిష్ఠించకపోతే వాడవాడలా ప్రాణనష్టం కలిగిస్తానని హెచ్చరించారు. అడ్డొచ్చిన వారిని కాలికింద నలిపేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆల తదితరులు పాల్గొన్నారు.

### నిన్న జరిగిన ఘటన దురదృష్టకరం

మహంకాళి బోనాలను దేశవ్యాప్తంగా అందరూ వీక్షించారని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. నిన్న ఉదయం నుంచే వేలాది మంది మహిళలు బోనాలను సమర్పించారన్నారు. రంగం కార్యక్రమం విజయవంతగా పూర్తయిందని, అంబారీ ఊరేగింపు జరుగుతుందని వివరించారు. ఉజ్జయిని మహంకాళి ఆలయానికి ఓ చరిత్ర ఉందని, 200 ఏళ్ల నుంచి ఇక్కడ బోనాల పండుగ జరుగుతూ వస్తోందన్నారు. దురదృష్టవశాత్తు నిన్న జరిగిన ఘటనకు బాధపడుతున్నానని తలసాని తెలిపారు. ఎమ్మెల్యేగా జోగినిలను క్షమించమని అడుగుతున్నానని వివరించారు. వాళ్లకే అలా జరగడం బాధాకరమని తెలిపారు.

# పోలవరం ముంపుపై సమగ్ర నివేదిక

**● తెలంగాణ వాదనలకు సాంకేతిక బలం కావాలి**
**● మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి**



**టీ మీడియా,ఆగస్ట్3,హైదరాబాద్ :**
పోలవరం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ వల్ల తెలంగాణలో ఏర్పడే ప్రభావంపై శాస్త్రీయ అధ్యయనం చేపట్టాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. భూములు, గ్రామాలు, ప్రజా మౌలిక సదుపాయాలు, ఇతర ఆస్తులు ఎంత మేర ముంపునకు గురయ్యే అవకాశం ఉందో ముందస్తుగా అంచనా వేసి సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని సూచించారు.తెలంగాణ వాదనలకు క్షేత్రస్థాయి సమాచారం, సాంకేతిక అధ్యయనాలు, ఆర్థిక నష్టం అంచనాలు వంటి విశ్వసనీయ ఆధారాలు ఉండాలని మంత్రి స్పష్టం చేశారు. ఈ అంశాన్ని కేంద్ర ప్రభుత్వం, పోలవరం ప్రాజెక్టు అథారిటీతో పాటు సంబంధిత సంస్థల ముందు బలంగా ప్రస్తావించాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లో పోలవరం ప్రాజెక్టు పూర్తిస్థాయిలో అమల్లోకి రాకముందే ఉమ్మడి ఖమ్మం జిల్లాపై బ్యాక్‌వాటర్ ప్రభావాన్ని స్పష్టంగా అంచనా వేసి కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని అన్నారు.

పోలవరం ముంపు లేదా బ్యాక్‌వాటర్ ప్రభావంతో నష్టపోయే భూములు, మౌలిక సదుపాయాలు, ఇతర ఆస్తులకు సంబంధించిన పరిహారం చెల్లించే బాధ్యత కేంద్ర ప్రభుత్వానికి చెందిన సంబంధిత సంస్థలదేనని మంత్రి పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న అంచనాలను త్వరగా పూర్తి చేసి, తెలంగాణ తరఫు వాదనలు అధికారికంగా సంబంధిత వేదికల ముందు ఉంచాలని అధికారులను ఆదేశించారు.

ఈ సమీక్ష సమావేశంలో ఈఎన్‌సీ (జనరల్) ఓ.వి. రమేశ్‌బాబు, సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్, ఈఎన్‌సీ (అడ్మిన్) పి. శ్రీనివాస్, ఈఎన్‌సీ (ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్) ఆర్. మధుసూదన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# పాదచారులు నడిచేందుకు దారివ్వండి



**● కేంద్ర సర్కారుకు సుప్రీంకోర్టు ఆదేశం**

**టి మీడియా , ఆగస్టు 3 , ఢిల్లీ బ్యూరో :**
పాదచారులకు రోడ్లపై నడవడానికి సరైన మార్గం లేకపోవడంవల్ల ప్రమాదాలు జరుగుతుండటంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. రహదారులు ఉన్న ప్రతిచోట పాదచారుల కోసం ఆక్రమణలు లేని స్థలాన్ని ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. పాదచారులు నడిచే మార్గం మోటార్ వాహనాలు ప్రయాణించే మార్గానికి విడిగా ఉండాలని పేర్కొంది. విడిగా మార్గాన్ని ఏర్పాటు చేయడానికి వీలుకాని ప్రదేశాల్లో రోడ్లకు, ప్రజలు నడిచే ప్రదేశానికి మధ్య తాడు అయినా కట్టాలని సూచించింది.రహదారుల పక్కన ఉండే ఖాళీ స్థలం తమ కోసమేనని, వాహనాల బెడద లేకుండా స్వేచ్ఛగా నడవగలమని పాదచారులకు నమ్మకం కలిగించాలని సుప్రీంకోర్టు పేర్కొన్నది. ఇందుకు రెండు వారాల గడువు ఇచ్చింది. అనంతరం పాదచారుల కోసం చేసిన ఏర్పాట్లపై నివేదిక సమర్పించాలని ఆదేశించింది. విషయాన్ని తదుపరి విచారణ కోసం రెండు వారాలకు వాయిదా వేసింది. ఫుట్‌పాత్‌లపై నడవడం కూడా ప్రజల ప్రాథమిక హక్కులలో భాగమని పేర్కొన్నది.

# తాగునీటి ఎద్దడిపై అప్రమత్తంగా ఉండాలి

**● సీఎం చంద్రబాబు**

**టీ మీడియా,ఆగస్ట్3,అమరావతి:**
ఎల్‌నినో పరిస్థితుల కారణంగా రాష్ట్రంలో ఏర్పడిన వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా తాగునీటి ఎద్దడి సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. రిజర్వాయర్లు, ఇతర నీటి వనరుల్లో నీటి లభ్యతను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.సోమవారం సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంలో వివిధ శాఖల పనితీరుపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో సీఎం ఈ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు కృష్ణా, గోదావరి నదుల నీటి పరిస్థితిని సీఎంకు వివరించారు. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండటంతో కృష్ణా బేసిన్‌లో నీటి లభ్యత పెరిగే అవకాశం ఉందని, ఇటీవల కృష్ణా నదిలో ప్రవాహాలు ప్రారంభమైనట్లు తెలిపారు. గోదావరిలోని వరద పరిస్థితిపైనా సీఎంకు వివరించారు.కృష్ణా బేసిన్‌కు ఎగువ నుంచి వచ్చే వరద జలాలను సద్వినియోగం చేసుకునేలా నీటి నిర్వహణ చేపట్టాలని సీఎం ఆదేశించారు. వర్షాభావం కారణంగా రానున్న రోజుల్లో పశుగ్రాసం కొరత ఏర్పడే అవకాశమున్నందున ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.మున్సిపాలిటీలు, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి నాణ్యతపై తరచూ పరీక్షలు నిర్వహించి, ల్యాబ్ నివేదికలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. అలాగే అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేయాలని సూచించారు.


ఈ సందర్భంగా రవాణా శాఖలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, అనవసర నిబంధనల తొలగింపుపై అధికారులు సీఎంకు వివరించారు. 24 గంటల్లో డీమ్డ్ రిజిస్ట్రేషన్ విధానం, ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్స్, ఫారం--5బీ వంటి పరీక్షలను తొలగించడం ద్వారా అవినీతిని తగ్గించి ప్రజలకు సులభతర సేవలు అందించవచ్చని తెలిపారు. ఈ సంస్కరణలను దశలవారీగా అమలు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు వెల్లడించారు.వీలైనంత మేరకు అనవసర నిబంధనలను తొలగించి ప్రజలకు మరింత సులభమైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్‌తో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# ఐదు నెలలుగా జీతాలు బంద్..!

**⏭| ఎంపీడీవో కార్యాలయ కంప్యూటర్ ఆపరేటర్ల దయనీయ పరిస్థితి**

**⏭| అప్పుల పాలై.. కుటుంబ పోషణే భారంగా మారింది**



**టీ మీడియా,ఆగస్ట్03,సింగరేణి(కారేపల్లి):** మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం (ఎంపీడీవో)లో విధులు నిర్వహిస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లకు గత ఐదు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో వారి కుటుంబాలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయాయి.ప్రతిరోజూ ప్రభుత్వ సేవలను అందిస్తూ, కార్యాలయాల నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తున్న తమను ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని ఆపరేటర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెలా జీతాలు సకాలంలో చెల్లిస్తుండగా, అదే ప్రభుత్వ సేవల్లో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లకు మాత్రం నెలల తరబడి వేతనాలు ఇవ్వకపోవడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నిస్తున్నారు. ఐదు నెలలుగా జీతాలు లేక ఇంటి అద్దె, పిల్లల చదువులు, నిత్యావసర ఖర్చులు, వైద్య అవసరాలు తీర్చలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, కుటుంబాలను పోషించేందుకు అప్పులు చేసి కాలం వెళ్లదీస్తున్నామని వాపోతున్నారు."పని మాత్రం పూర్తి స్థాయిలో చేయించుకుంటున్నారు... జీతాలు మాత్రం నెలల తరబడి నిలిపివేస్తున్నారు.మా శ్రమకు విలువ లేదా?" అంటూ ఆపరేటర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు.గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే ఈ సమస్యపై స్పందించి, పెండింగ్‌లో ఉన్న ఐదు నెలల వేతనాలను తక్షణమే విడుదల చేయడంతో పాటు, ఇకపై ప్రతి నెలా సకాలంలో వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. ప్రభుత్వ కార్యాలయాల పనితీరుకు వెన్నెముకలా పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లను ఇకపై నిర్లక్ష్యం చేయవద్దని విజ్ఞప్తి చేశారు.

# మృతుడి కుటుంబానికి మేఘన్న అభయ హస్తం



**టీ మీడియా, ఆగస్టు 3 ,పెబ్బేరు:**వనపర్తి జిల్లా పెబ్బేరు మండలంలోని తోమాలపల్లి గ్రామానికి చెందిన కాంగ్రేస్ సీనియర్ కార్యకర్త బోరింగ్ రాముడు గత వారం రోజులుగా అనారోగ్యం తో బాధ పడుతూ అకాలంగా మరనించడం జరిగింది దహన సంస్కారాల నిమిత్తం తోమాలపల్లి గ్రామ కాంగ్రేస్ నాయకులు ఎం ఎల్ ఏ తూడి మేఘారెడ్డి ఆదేశాల మేరకు మేఘన్న అభయ హస్తం కింద 5000 రూపాయలు మృతుని కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో సర్పంచ్ అశోక్ కుమార్ మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్ ఉప సర్పంచ్ రాంబాబు మాజీ గ్రామ అధ్యక్షులు రంగన్న యాదవ్డైరెక్టర్ రామన్ గౌడ్ వార్డ్ మెంబర్ ఉమేష్ గౌడ్ మాజీ వార్డ్ మెంబర్ మహేష్ బాబు రమేష్ కుమార్ శివకుమార్ నెంబర్ రాముడు తదితరులు పాల్గొని నివాళులు అర్పించడం జరిగింది.

# పీసా మొబలైజర్ల అడ్రస్ ఎక్కడ..?



**⏭| ఏజెన్సీ గ్రామ పంచాయతీల్లో వారే కీలకం**

**టీ మీడియా , ఆగస్టు 3 కామేపల్లి :** ఏజెన్సీ గ్రామపంచాయతీలో కీలక విధులు నిర్వహించాల్సిన పీసా మొబలైజర్లు... అడ్రస్ లేకుండా పోయారు.... వారు కనపడరు... అధికారులు పట్టించుకోరు ...ప్రభుత్వ సంక్షేమ పథకాల పై ఏజెన్సీ గ్రామాల్లో నివసిస్తున్న గిరిజనులకు అవగాహన కల్పించడానికి గిరిజనులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలనే ఉద్దేశంతో పీసా మొబలైజర్ల ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఏజెన్సీ లోని ప్రతి గ్రామ పంచాయతీకి ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒక్కొక్కరిని నియమించారు. వీరు గ్రామ పంచాయతీల్లో ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించి గ్రామ సభలకు గిరిజనులు హాజరయ్యేటట్లు చూడాలి గ్రామ సభలను బలోపేతం చేయడానికి సభలు, సమావేశాలు ఏర్పాటు చేయడం ఉపాధి హామీ పథకం, గిరిజన సంక్షేమ పథకాలు గ్రామ సభల ద్వారా జరిగేటట్లు చూసి గిరిజనులకు అవగాహన కల్పించడం పిసా మొబలైజర్ల బాధ్యత భూమి, ఆటవి హక్కులు, గిరిజనుల ఇతర సమస్యలను గ్రామసభలో చర్చించి అనుమతులు తీసుకోవటం గ్రామాల్లో ఎస్ హెచ్ జి, వాటర్ కమిటీలు, స్కూల్ కమిటీలను గ్రామ సభ ఆధీనంలోకి తేవడం వీరి ప్రధాన బాధ్యత... ఇంతటి కీలకమైన బాధ్యతలు నిర్వహించాల్సిన పీసా మొబలైజర్లు గ్రామాల్లో కనీసం కనిపించిన దాఖలాలు లేవు. మండలంలోని 24 గ్రామ పంచాయతీలు ఉండగా అధికారుల లెక్కల ప్రకారం కేవలం 10 గ్రామాలకే పీసా మొబలైజర్లు ఉన్నట్లు మిగతా 14 గ్రామ పంచాయతీ లకు లేరని మండల అధికారులు తెలిపారు.ఈ గ్రామ పంచాయతీలో ఉన్న పిసా మొబలైజర్లు కనీసం ఆయా గ్రామ పంచాయతీలు నిర్వహించే గ్రామసభల్లో సర్పంచులు అధికారుల కంటికి కనిపించడం లేదు. వారిని గైడ్ చేయాల్సిన అధికారులు మొద్దు నిద్రలో ఉన్నారు. ఇళ్ల వద్ద కూర్చొని ఈ మొబలైజర్లు జీతాలు తీసుకుంటున్నట్లు తెలుస్తుంది. దీనిపై మండల పంచాయతీ అధికారి వివిఎస్ శాస్త్రి ని వివరణ కోరగా తన దృష్టికి వచ్చిందని గ్రామపంచాయతీలో ప్రతిరోజు వారు హాజరైనట్లు చర్యలు తీసుకుంటామని ఉల్లంఘించిన వారికి షోకాజు నోటీసులు జారీ చేస్తామని తెలిపారు. మీరు మండల పంచాయతీ అధికారిగా బాధ్యతలు తీసుకున్న ఐదు నెలల తర్వాత వారిపై తీసుకున్న చర్యల గురించి ప్రశ్నించగా ఇప్పుడు చర్యలు తీసుకుంటానని చెప్పడం కోస మెరుపు.

# ఇకపై ఇంటి నంబర్స్ ఆన్లైన్ సేవలోనే

**⏭|కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్ రెడ్డి**



**టీ మీడియా , ఆగస్టు 3 ఖమ్మం రూరల్ :** ఎదులపురం మున్సిపాలిటీ ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన, సులభమైన పౌర సేవలను అందించాలనే లక్ష్యంతో ఎదులాపురం మున్సిపాలిటీ పరిధిలో ఇంటి నంబర్ల (హౌస్ నంబర్) కేటాయింపు ప్రక్రియను పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో అమలు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్ రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.మున్సిపాలిటీ పరిధిలో కొత్తగా నిర్మించిన గృహాలు, ఇప్పటివరకు ఇంటి నంబర్ లేని భవనాలు, అలాగే భవన విభజన జరిగిన ఇళ్ల యజమానులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. దరఖాస్తుతో సమర్పించిన పత్రాలను పరిశీలించిన అనంతరం సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీ నిర్వహించి, నిబంధనలకు అనుగుణంగా ఇంటి నంబర్ కేటాయిస్తారని తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తు సమయంలో రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్, భవన నిర్మాణ అనుమతి పత్రం, ఈసీ (జుజ), లింక్ డాక్యుమెంట్లు, ఆధార్ కార్డు, ఇంటి పక్కన ఉన్న ఇళ్ల నంబర్ల వివరాలు, జీపీఎస్ కెమెరాతో తీసిన భవనం ఫోటోలను తప్పనిసరిగా అప్లోడ్ చేయాలని సూచించారు. ఈ విధానం ద్వారా దరఖాస్తుల పరిష్కారం వేగవంతం కావడంతో పాటు పారదర్శకత పెరుగుతుందని, కార్యాలయాలకు పలుమార్లు రావాల్సిన అవసరం తగ్గుతుందని కమిషనర్ తెలిపారు. ఇంటి నంబర్ పొందడం ద్వారా ఆస్తి పన్ను నమోదు, తాగునీటి, డ్రైనేజీ, విద్యుత్ కనెక్షన్లు, పోస్టల్ సేవలు, బ్యాంకింగ్ సేవలు, వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను సులభంగా పొందవచ్చని వివరించారు. అర్హులైన గృహ యజమానులందరూ ఈ ఆన్‌లైన్ సేవను సద్వినియోగం చేసుకుని తమ ఇళ్లకు అధికారిక ఇంటి నంబర్ పొందాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దరఖాస్తు ప్రక్రియకు సంబంధించిన పూర్తి వివరాల కోసం మున్సిపల్ కార్యాలయం, సంబంధిత వార్డు కార్యదర్శి లేదా మున్సిపల్ హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించాలని సూచించారు.ప్రజలకు వేగవంతమైన సేవలు -- పారదర్శక పరిపాలనే మా లక్ష్యం" అని కమిషనర్ పేర్కొన్నారు

# ఎంఎల్ఏ అంగరక్షకుడి తండ్రిహఠాన్మరణం



**టీ మీడియా, ఆగస్టు 03 పెబ్బేరు:** వనపర్తి జిల్లా పెబ్బేరు మండలంలోని తిప్పాయపల్లి గ్రామానికి చెందిన కావలి బుచ్చన్న గుండెపోటుతో హఠాన్మరణం చెందడం జరిగింది విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మెఘారెడ్డి మృతుడి స్వగృహానికి వెళ్లి ఆయన భౌతిక కాయానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ధైర్యంగా ఉండా లని భవిష్యత్తులో ఏ సహాయం కావాలన్నా అండగా ఉంటానని ఎం ఎల్ ఏ భరోసా ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో ఎం ఎల్ ఏ తో పాటు పెబ్బేరు మండల ప్రెసిడెంట్ యాపర్ల రామ్ రెడ్డి టౌన్ ప్రెసిడెంట్ దయాకర రెడ్డి మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ మార్కెట్ వైస్ చైర్మన్ విజయవర్ధన్ రెడ్డి యుగంధర్ రెడ్డి వెంకటరమణ షకీల్ చెలిమిళ్ళ రాముడు రణధీర్ రెడ్డి సునీల్ మాలపల్లి సురేందర్ గౌడ్ తిప్పాయపల్లి సర్పంచ్ రాముడు మహేశ్వర్ రెడ్డి వీరస్వామి తదితరులు నివాళులు అర్పించడం జరిగింది

# ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షున్ని కలిసిన నాయకులు



**టీ మీడియా, ఆగస్టు 3 ,పెబ్బేరు:** వనపర్తి పట్టణ కేంద్రంలోని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డినీ వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసిన పెబ్బేరు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎల్ నినో ప్రభావం వల్ల వర్షాలు లేవు ప్రియ దర్శిని జూరాల ప్రాజెక్టు ఎడమ కాల్వ నుండి పెబ్బేరు పట్టణ మండలాల రైతులకు తక్షణమే నీరు అందించాలని ఇరిగేషన్ అధికారులతో మాట్లా డడం జరిగింది రాంపురం గ్రామానికి ఉదయం సాయంకాలం బస్సు నడిపించాలని డిపో మేనేజర్ తో ఫోన్లో మాట్లాడటం జరిగింది మండల నాయకులతో ప్రస్తుత రాజకీయాల గురించి చర్చించడం జరిగింది ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పి ఎల్లారెడ్డి జి మణ్యం ఎస్ సహదేవుడు అయ్యవారిపల్లి సర్పంచ్ కురుమూర్తి సాగర్ గుమ్మడం హరికుమార్ రెడ్డి తోమాలపల్లి కృపాకర్ రెడ్డి సత్యనారాయణ రెడ్డి వట్టిపల్లి ఈశ్వర్ రెడ్డి ఆనంద్ సాగర్ పాతపల్లి చంద్రశేఖర్ తిప్పాయపల్లి ఎల్లస్వామి నాయుడు గుమ్మడం తాండ సర్పంచ్ హనుమంత్ నాయక్ రాజు నాయక్ సహదేవుడు తదితరులు పాల్గొన్నారు

# 21లక్షల 'స్త్రీనిధి' నిధుల స్వాహా

**జిల్లా కలెక్టర్, డి ఆర్ డి ఏ పి.డి లకు మహిళల ఫిర్యాదు**



**టీ మీడియా, ఆగస్టు 03, టేక్మాల్ :** మహిళా సంఘాల సభ్యులకు తెలియకుండా నకిలీ సంతకాలతో లక్షలాది రూపాయల స్త్రీనిధి రుణాలను కాజేసిన ఘటన మెదక్ జిల్లా టేక్మాల్ గ్రామ పంచాయతీ పరిధిలోని గొల్లగూడెం లో వెలుగుచూసింది. ఈ ఘోర అక్రమాలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ గొల్లగూడెం మహిళా సమైక్య సంఘ సభ్యులు సోమవారం మెదక్ జిల్లా కలెక్టర్ కు,డి ఆర్ డి ఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ పీడీ వేర్వేరు కు ఫిర్యాదులు సమర్పించారు.

**చదువు రాకపోవడమే శాపమైంది**

గొల్లగూడెం గ్రామానికి చెందిన కనకదుర్గ, మహేశ్వరి, మల్లేశ్వరి, మల్లికార్జున, నల్ల పోచమ్మ, సంతోషి మాత, వీర హనుమాన్, విజయలక్ష్మి తదితర సంఘాల మహిళలకు చదువు రాకపోవడాన్ని ఆసరాగా చేసుకుని వివోఏ అంజనేయులు ఈ అక్రమాలకు పాల్పడ్డాడు. ఫోర్జరీ తీర్మానాలతో రూ. 18 లక్షల గోల్‌మాల్మ హిళా సభ్యుల ప్రమేయం లేకుండానే నకిలీ తీర్మానాలు రాసి, సంతకాలు ఫోర్జరీ చేసిలి స్త్రీనిధి నుండి అక్రమంగా రుణాలు పొందాడు.మొత్తం దుర్వినియోగమైన నిధులు పద్దెనిమిది లక్షల రూపాయలు . సి ఐ ఎఫ్ వెలుగు గ్రామ సంఘం నిధులు ?3,00,000/- కూడా ఉన్నాయి.

**బకాయిల సమాచారంతో బయటపడ్డ నిజం**

2023లో తీసుకున్న రుణాలకు సంబంధించి "స్త్రీనిధి బకాయిలు ఉన్నాయి" అని గ్రామ సమాఖ్య ఉన్నతాధికారి చెప్పడంతో మహిళలు దిగ్భ్రాంతి చెందారు. విచారణ చేయగా, వివో ఏ అంజనేయులు తమ పేర్లపై బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొని సొంతానికి వాడుకున్నట్లు తేలింది.

**ఉన్నతాధికారులకు మహిళల విజ్ఞప్తి**

కలెక్టర్ ఔ డి ఆర్ డి ఏ పీడీ లకు వినతి: తమ పేర్లతో అక్రమంగా రుణాలు పొంది మోసానికి పాల్పడిన వివో ఏ అంజనేయులుపై ఈ అక్రమాల్లో భాగస్వాములైన అధికారులపై శాఖాపరమైన కేసులు నమోదు చేయాలని కోరారు.న్యాయం చేయాలని డిమాండ్:బాధిత సభ్యుల (ఇందిర, సాధు పోచమ్మ, సునంద, ఒగమ్మ, మానేమ్మ తదితరులు బ్యాంకు ఖాతాల వివరాలను పూర్తిస్థాయిలో పరిశీలించి, తమకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్ మరియు డీఆర్‌డీఏ అధికారులను వేడుకున్నారు.

# భూసేకరణ గ్రామసభ

**⏭ వివరాలు వెల్లడించిన డిప్యూటీ కలెక్టర్**

**టీ మీడియా ఆగస్టు 3 కామేపల్లి:** ఖమ్మం జిల్లా కామేపల్లి మండల పరిధిలోని పొన్నెకల్ గ్రామంలో ఎస్ఆర్ఎల్ఐపి ప్యాకేజీ పనులకు సంబంధించిన భూసేకరణపై సోమవారం ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భూసేకరణ విభాగం డిప్యూటీ కలెక్టర్ సదానందం ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా భూసేకరణ ప్రాముఖ్యత, రైతులకు అందించే నష్టపరిహారం, మరియు ప్రాజెక్టు ద్వారా లభించే ప్రయోజనాల గురించి డిప్యూటీ కలెక్టర్ గ్రామీణులకు సవివరంగా తెలియజేశారు. భూసేకరణ ప్రక్రియ పారదర్శకంగా జరుగుతుందని, రైతుల సందేహాలను నివృత్తి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.ప్రస్తుతం క్షేత్రస్థాయిలో పెగ్ మార్కింగ్ పనులు వేగవంతంగా ప్రారంభమైనట్లు సంబంధిత అధికారులు డిప్యూటీ కలెక్టర్‌కు వివరించారు. భూమి కోల్పోతున్న రైతులకు



చట్టప్రకారం తగిన న్యాయం జరిగేలా చూస్తామని అధికారులు పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో కామేపల్లి తహశీల్దార్ శ్రీనివాసరావు, రెవెన్యూ ఇన్ స్పెక్టర్ (ఆర్ఐ) విజయ భాస్కర్, స్థానిక సర్పంచ్, ఇతర రెవెన్యూ సిబ్బంది మరియు గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అధికారులు అప్రమత్తం



**టీ మీడియా , ఆగస్టు 3 , ఆళ్లపల్లి:** ఆళ్లపల్లి మండలం పెద్ద వెంకటాపురం పంచాయతీ సింగారం గ్రామంలో జ్వరంతో 9 సంవత్సరాల బాలుడు మృతి చెందిన ఘటనపై ఆరోగ్య శాఖ తక్షణ చర్యలు చేపట్టింది.జిల్లా కలెక్టర్ మరియు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ఆదేశాల మేరకు డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డా. ప్రతాప్, మలేరియా కార్యక్రమ అధికారి డా. శ్రీధర్‌లతో కలిసి సోమవారం సింగారం గ్రామాన్ని సందర్శించారు. బాలుడి కుటుంబ సభ్యులు, గ్రామస్థులను కలిసి వివరాలు సేకరించి, ఈ ఘటనకు సంబంధించిన సమగ్ర నివేదికను జిల్లా వైద్య ఒ ఆరోగ్య అధికారి, జిల్లా కలెక్టర్ , ప్రజారోగ్య సంచాలకులకు సమర్పించారు.గ్రామంలో వ్యాధులు ప్రబలకుండా నివారణ చర్యలను యుద్ధప్రాతిపదికన చేపట్టారు. గ్రామమంతటా బ్లీచింగ్ పౌడర్ స్ప్రే, యాంటీ లార్వల్ చర్యలు చేపట్టడంతో పాటు ప్రత్యేక ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో సుమారు 170 మంది గ్రామస్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, రాపిడ్ డయాగ్నస్టిక్ టెస్ట్ పరీక్షలు చేశారు. అవసరమైన వారికి వైద్య సేవలు, మందులు అందజేశారు. అలాగే జ్వరాల పర్యవేక్షణ, దోమల నివారణ చర్యలు ప్రజలకు ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆళ్లపల్లి పిహెచ్సి రైతులు డా. గోపీలాల్, సిహెచ్ వో నాగభూషణం, ఎంవో గొంది వెంకటేశ్వర్లు, డిపిఎమ్ఓ పాయం శ్రీనివాసరావు, సర్పంచ్ ఉమ దంపతులు, హెచ్ ఇ రమాదేవి ఆళ్లపల్లి పీహెచ్సీ వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఫలితాల సాధనే ధ్యేయంగా పనిచేయాలి

**⏭ జిల్లా విద్యాశాఖ అధికారి సదానందం**

**టీ మీడియా, ఆగస్టు 3 కామేపల్లి:** విద్యార్థులలో మెరుగైన అభ్యసన ఫలితాల సాధనే లక్ష్యంగా ఉపాధ్యాయులు, అధికారులు శక్తివంచన లేకుండా పనిచేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) సదానందం, జిల్లా అకాడమిక్ అధికారి (డీఏఓ) ప్రభాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం కామేపల్లి మండలంలోని ముచ్చర్ల–జాస్తిపల్లి హైస్కూల్‌ను వారు ఆకస్మికంగా సందర్శించి, పాఠశాలలోని బోధనా పద్ధతులను, మౌలిక వసతులను క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా విద్యాశాఖ అధికారులు పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఆహార నాణ్యత పట్ల పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం వంట సిబ్బందితో మాట్లాడుతూ.. పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వంట చేసే పరిసరాలను ఎల్లప్పుడూ అత్యంత శుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. పాత్రలను శుభ్రం చేసుకున్న



తర్వాతే వంట ప్రక్రియను ప్రారంభించాలని స్పష్టం చేశారు. అలాగే, భౌగోళికంగా పక్కపక్కనే ఉన్న ముచ్చర్ల, జాస్తిపల్లి ప్రాథమిక పాఠశాలల పిల్లలను ఒకే ప్రాంగణంలోకి చేర్చి, బోధనా అభ్యసన ప్రక్రియలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని మండల విద్యాశాఖ అధికారి (ఎమ్ఈఓ)కి సూచించారు. ఈ విద్యా సంస్కరణల సజావు నిర్వహణకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, గ్రామ సర్పంచ్‌లు మరియు ఏఏపీసీ ప్రతినిధుల పూర్తి సహకారం తీసుకోవాలని డీఈఓ అధికారులకు మార్గదర్శనం చేశారు.

# ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటం వద్దు: సీపీఎం



**టీ మీడియా, ఆగస్టు 3 కామేపల్లి:** మండలంలోని ముచ్చర్ల ఐ రోడ్డు నుండి ఏన్కూరు వరకు ఉన్న ప్రధాన రహదారిని తక్షణమే మరమ్మతు చేయాలని సీపీఎం మండల నాయకుడు బాదావత్ శ్రీను ప్రభుత్వాన్ని, సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గత ఐదేళ్లుగా ఈ ప్రధాన రహదారి తీవ్రంగా దెబ్బతిని దయనీయ స్థితికి చేరిందని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డును పునర్నిర్మించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో ఇప్పటికే అనేక నిరసనలు, ఆందోళన కార్యక్రమాలు నిర్వహించామని గుర్తుచేశారు. పలుమార్లు సంబంధిత అధికారులకు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. గోతులమయంగా మారిన ఈ రహదారిపై ప్రయాణించలేక నిత్యం ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురై తీవ్రంగా గాయపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల ప్రాణాలకు ముప్పుగా పరిణమించిన ఈ రోడ్డును ఇకనైనా అధికారులు స్పందించి పునర్నిర్మించాలని, ప్రజలకు సురక్షిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించాలని కోరారు.
ప్రభుత్వం, అధికారులు ఇప్పటికైనా స్పందించకపోతే ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని, అధికారుల నిర్లక్ష్యాన్ని నిలదీస్తామని బాదావత్ శ్రీను హెచ్చరించారు.

# బైక్ మెకానిక్ యూనియన్ అధ్యక్ష,కార్యదర్శులుగా ఫయాజ్, షౌకత్

**టీ.మీడియా,ఆగస్టు3 ,చింతూరు:** బైక్ మెకానిక్ అధ్యక్షుడిగా మొహమ్మద్ ఫయాజ్, కార్యదర్శిగా షేక్ సౌకత్, ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చింతూరులో సోమవారం బైక్ మెకానిక్ యూనియన్ ఎన్నిక జరిగింది. సోమవారం జరిగిన యూనియన్ సమావేశంలో కోశాధికారిగా (ట్రెజరర్) నందిగామ సురేంద్ర ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను యూనియన్ సభ్యులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మొహమ్మద్ ఫయాజ్ మాట్లాడుతూ, బైక్ మెకానిక్‌ల సంక్షేమం, వృత్తి అభివృద్ధి, సభ్యుల సమస్యల పరిష్కారం కోసం యూనియన్ తరఫున సమిష్టిగా కృషి చేస్తామని తెలిపారు.కార్యదర్శి షేక్ సౌకత్ మాట్లాడుతూ సభ్యులందరి సహకారంతో యూనియన్‌ను మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. ట్రెజరర్ నందిగామ సురేంద్ర యూనియన్ ఆర్థిక





వ్యవహారాలను పారదర్శకంగా నిర్వహిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో చింతూరు బైక్ మెకానిక్ యూనియన్ సభ్యులు పాల్గొని నూతన కమిటీకి అభినందనలు తెలియజేశారు.

## రహదారులను పరిశీలించిన టీడీపీ మండల అధ్యక్షులు



**టీ.మీడియా,ఆగస్టు3,చింతూరు:** చింతూరు మండలంలోని ఏ.జీ. కోడేరు గ్రామ పంచాయతీ పరిధిలో ఎ జి కోడేరు ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా వరదలకు దెబ్బతిన్న గ్రామీణ రహదారులను తెలుగుదేశం పార్టీ చింతూరు మండల అధ్యక్షులు ఎం.డి. జమాల్ ఖాన్ ప్రత్యక్షంగా సందర్శించి పరిశీలించారు.ఈ సందర్భంగా గ్రామాల మధ్య రాకపోకలకు ప్రధాన ఆధారమైన రహదారులు వరద ప్రవాహానికి తీవ్రంగా దెబ్బతినడంతో ప్రజలు, రైతులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. గ్రామాల్లోని ఇళ్లలోకి వరదనీరు ప్రవేశించకపోయినప్పటికీ, రహదారులు దెబ్బతినడం వల్ల నిత్యావసర సేవలు, అత్యవసర వైద్య సేవలు, వ్యవసాయ ఉత్పత్తుల రవాణా, సాధారణ రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడిందని తెలిపారు. కార్యక్రమంలో ఓబులనేని నరసింహారావు, మల్లెల వెంకటేశ్వరరావు, మంగవేణి, సల్మాన్ రాజు,గ్రామ నాయకులు మల్లయ్య, కుర్ర బాబురావు, జాఫర్, ప్రసంగీ, అంజి, బత్తుల శ్రీను, పంచాయతీ కార్యదర్శి, ఇతర గ్రామ పెద్దలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సున్నం రాజయ్య 6వ వర్ధంతి



**టీ.మీడియా,ఆగస్టు3,చింతూరు:** మాజీ ఎమ్మెల్యే సున్నం రాజయ్య 6వ వర్ధంతి చింతూరులోని శ్యామల వెంకటరెడ్డి స్మారక భవనంలో ఘనంగా జరిగింది. సందర్భంగా వర్ధంతి సభ ఏర్పాటు చేశారు . ఈ సభలో సిపి ఎం చింతూరు టౌన్ శాఖ కార్యదర్శి ఎస్కె షాజ హాన్ మాట్లాడుతూ అమరజీవి సున్నం రాజయ్య ఆదివాసీల హక్కులకై అలుపెరుగని పోరాటం చేశారన్నారు. యూపీఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు అటవీ హక్కుల కోసం చర్చలు జరిపి చట్టాన్ని సాధించిన ఘనత సున్నం రాజయ్య మీడియం బాబురావు దేనని ఈ సందర్భంగా అన్నారు.వెదురు కార్మికులకు యస్ యస్ ఆర్ రేట్లు ఇవ్వకుండా శ్రమ దోపిడీ చేస్తున్న వెదురు గుత్తేదారులకు చెమటలు పట్టించి ఎఫ్ఎస్ఆర్ రేట్లు వెదురు కార్మికులకు అందేలా కృషిచేసిన వ్యక్తి సున్నం రాజయ్య అని గుర్తు చేశారు. పోలవరం ప్రాజెక్టు పట్ల నిర్వాసితులవుతున్న ప్రజానీకం పక్షం నిలబడి పోలవరం పరిహారం కచ్చితంగా అమలు జరిగేలా అలుపెరుగని పోరాటాలు చేసిన మహోన్నత వ్యక్తి సున్నం రాజయ్య అని గుర్తు చేశారు .ఈ కార్యక్రమం లో నాయకులు పట్రా రమేష్. సోడి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

# అమరచింతకు రానున్న ఎస్బిఐ



**టీ మీడియా ,ఆగస్టు 3, ఆత్మకూరు:**
వనపర్తి జిల్లా అమరచింత మండల కేంద్రానికి ఎన్నో ఏళ్ళుగా ఎదురుచూస్తున్న స్టేట్ బ్యాంకు అఫ్ ఇండియా సేవలు మహబూబ్నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణమ్మ కృషితో రానున్నాయని బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ బంగ్ల లక్ష్మికాంత్ రెడ్డి విలేకరులకు తెలియజేసారు. రెండు నెలల క్రితం హైదరాబాద్ లోని ఎస్బిఐ సెంట్రల్ కార్యాలయంలోని ఎస్బిఐ సౌత్ ఇండియా ఏజీఎం సునీల్ గోయెల్ ని అమరచింత పట్టణ బీజేపీ అధ్యక్షురాలు డాక్టర్ మంగా లావణ్య అంజి తో వెళ్లి కలిసి అమరచింత పట్టణ పరిసర ప్రాంతాలలోని వ్యాపారస్తులు, ఉద్యోగస్తులు రైతులు పడుతున్న ఇబ్బందులను సునీల్ గోయెల్ దృష్టికి తీసుకెళ్లగా, తక్షణమే స్పందించిన ఏ జి ఎం మీ మండలకేంద్రానికి త్వరలోనే ఎస్బిఐ బ్యాంకు మంజూరవుతుందని తెలియజేసారు.మహబూబ్నగర్ లోని ఎస్బిఐ జోగులాంబ గద్వాల డివిజన్ అధికారులు అమరచింత పట్టణం సైట్ విజిట్ చేయడం, వివరాలను సేకరించడం జరిగింది. హైదరాబాద్ లోని ఎస్బిఐ సెంట్రల్ కార్యాలయానికి శృంగా లావణ్య , మరాఠి అశోక్ , శ్రీ నర్సింలు గౌడ్ గారు, శ్రీ మంగ అంజి ,శ్రీ కొంగరి భాస్కర్ , ఫిరోజ్ రాజు , సత్యేన్దర్ , రవికుమార్ , రఘు తో కలిసి వెళ్లిన బంగ్ల లక్ష్మికాంత్ రెడ్డి ఎస్బిఐ ఏటీఎం ని సంప్రదించగా మీ అమరచింతకు ఎస్బిఐ బ్యాంకు మంజూరు అయిందని, రెండు, మూడు నెలలలో ఎస్బిఐ సేవలు అందుబాటులోకి వస్తాయని తెలియజేసారు.అమరచింతకు ఎస్బిఐ బ్యాంకు రావడానికి అహర్నిశలు కృషి చేసిన జేజమ్మకు శతకోటి వందనాలు తెలిపిన డాక్టర్ బంగ్ల లక్ష్మికాంత్ రెడ్డి, డాక్టర్ మంగా లావణ్య అంజి అమరచింత డెవలప్మెంట్ ఫోరమ్ సభ్యులు.

# అంగన్వాడీ కేంద్రానికి 200 గజాల భూదానం

**చిన్నారుల భవిష్యత్తుకు**

**పర్సా కుటుంబం గొప్ప చేయూత**

**టీ మీడియా ,ఆగస్ట్03,సింగరేణి(కారేపల్లి):**
ఖమ్మం జిల్లా సింగరేణి మండలం పేరుపల్లి-2 అంగన్వాడీ కేంద్రం నిర్మాణం కోసం పర్సా సూర్యప్రకాశరావు--ఛాయాదేవి కుటుంబ సభ్యులు 200 గజాల విలువైన భూమిని స్వచ్ఛందంగా దానం చేసి ఆదర్శంగా నిలిచారు. భూదానానికి సంబంధించిన పత్రాలను గ్రామ సర్పంచ్ బానోత్ పద్మావతి వీరభద్రంకు అందజేశారు.ఈ స్థలంలో అంగన్వాడీ భవనం నిర్మాణానికి అనుమతి ఇస్తూ గ్రామపంచాయతీ పాలకవర్గం ఆమోదించిన తీర్మానాన్ని సోమవారం ఐసీడీఎస్ అధికారులకు సర్పంచ్ అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ బానోత్ పద్మావతి వీరభద్రం మాట్లాడుతూ,గ్రామంలోని చిన్నారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా



విలువైన భూమిని దానం చేసిన పర్సా సూర్యప్రకాశరావు--ఛాయాదేవి కుటుంబ సభ్యులు అభినందనీయులని కొనియాడారు.వారి సేవా భావం ఇతరులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి సురేష్,ఐసీడీఎస్ సూపర్వైజర్ సత్యశీల, అంగన్వాడీ ఉపాధ్యాయులు సుశీల, సీత, విజయతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలకి అండ పొంగులేటి శీనన్న



**టీ మీడియా, ఆగస్టు 3 ,కూసుమంచి:**
కుటుంబంలో అన్ని బాధ్యతలు చూసుకునే యజమాని మృతి చెందడంతో ఆ కుటుంబం మనోధైర్యాన్ని కోల్పోకుండా నేను ఉన్నానంటూ రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆ కుటుంబాలకి భరోసానిస్తూ, అండగా నిలుస్తున్నారు. అందులో భాగంగానే మంత్రి పొంగులేటి శీనన్న ఆత్మీయ భరోసా ఇస్తూ పేద కుటుంబాలకి నమ్మకానికి ప్రతీకగా నిలిచారు. ఈ మేరకు ఇటీవల మృతి చెందిన కూసుమంచి మండలంలోని మృతుల కుటుంబాలకి పి ఎస్ ఆర్ క్యారిటబుల్ ట్రస్టు ద్వారా 44 కుటుంబాలకి పదివేల రూపాయల చొప్పున అందించి వారికి భరోసా కల్పించారు. సోమవారం కూసుమంచి మండలంలోని నేలపట్ల లోకేష్ తండా గంగ బండ తండా గట్టుసింగారం మల్లేపల్లి పెర కసింగారం అజ్మీర పెరమంతండ నాయకన్ గూడెం పాలేరు సంధ్య తండ గదిగోల్లపల్లి పో చారం ముత్యాల గూడెం కేశవాపురం కొరక గూడెం కూసుమంచి గ్రామాలలో పర్యటించి మృతుల కుటుంబాలని పరామర్శించారు. రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కూసుమంచి క్యాంపు కార్యాలయ ఇన్చార్జి భీమిరెడ్డి శ్రీని వాసరెడ్డి మృతుల చిత్రపటాలకు పుష్పగుచ్చం నుంచి నివాళులర్పించి, ఆ కుటుంబాలకి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి పొంగులేటి శీనన్న మృత కుటుంబాలకు ఎప్పుడు అండగా నిలుస్తారని, మనోధైర్యాన్ని ఏమాత్రం కోల్పో వద్దని ఆయన సూచించారు. సందర్భంగా ఆ కుటుంబాలకు , 10 వేల రూపాయలను భీమిరెడ్డి శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా అంద జేశారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బజ్జూరి వెంకటరెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు జొన్నలగడ్డ రవికుమార్, మాజీ ఎంపీపీ, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు జూకూరి గోపాల్ రావు, మాదాసు ఉపేందర్ రావ్, భారీ వీరభద్రం, కొండ మహిపాల్,నాయకులు మంకెన వాసు, చాట్ల పరశురాం కంచర్ల జీవన్ రెడ్డి కొర్ర రమేష్ కొత్త పుల్లారెడ్డి పడితే వెంకటేష్ నాయక్ భగవత్ నరేష్ యువజన విభాగం నాయకులు శేఖర్ రెడ్డి రఫీ , కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు శీనన్న అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# వీధి కుక్కల సమస్యపై వినతిపత్రం



**టీ మీడియా, ఆగస్టు 3, మక్తల్నారాయణపేట**
జిల్లా మక్తల్ మున్సిపాలిటీ పరిధిలో రోజురోజుకు తీవ్రమవుతున్న వీధి కుక్కల సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ, మున్సిపల్ చైర్పర్సన్ కి వినతిపత్రం అందజేశారు. ఈ విషయంపై ఆమె సానుకూలంగా స్పందిస్తూ మున్సిపల్ కమిషనర్ మున్సిపల్ మేనేజర్ కు ఈ సమస్యపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.ప్రజలకు భరోసా కల్పించేలా తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.లేనిపక్షంలో ప్రజల తరపున బీజేపీ మక్తల్ శాఖ టీం ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమాలు నిర్వహించాల్సి వస్తుందని, ఆ పరిస్థితికి పూర్తి బాధ్యతమున్సిపల్ యంత్రాంగానిదేనని హెచ్చరించారు.

ఈ కార్య క్రమంలో కౌన్సిలర్లు రాజశేఖర్ రెడ్డి, పీకే నరసింహ, తప్ప కృష్ణ.:బీజేపీ నాయకులు, కార్యకర్తలు బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బి. భరత్, బ్యాటరీ రాజు, కే నరేందర్ మహేష్ సాగర్, శ్రీకాంత్, మంజునాథ్, ఆంజనేయులు, నవీన్, జావిద్, అశోక్, గోవిందు, భీమేష్, పాపిరెడ్డి పాల్గొన్నారు.

## మండల జనరల్ బాడీ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే



**టీ మీడియా ,ఆగస్టు 3, మదనాపురం:**
వనపర్తి జిల్లా మదనపురం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య (జనరల్ బాడీ) సమావేశంలో దేవరకద్ర ఎమ్మెల్యే శ్రీ జి. మధుసూదన్ రెడ్డి పాల్గొని, అన్ని ప్రభుత్వ శాఖల పనితీరును సమగ్రంగా సమీక్షించారు.ఈ సందర్భంగా రెవెన్యూ, వ్యవసాయ, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, ఉపాధి హామీ, విద్య, వైద్య ఆరోగ్యం, విద్యుత్, హౌసింగ్, మిషన్ భగీరథ, గ్రామీణ నీటి సరఫరా, పశుసంవర్ధక, ఆర్అండ్బీ, ఉద్యానవన, ఎక్సైజ్, ఇరిగేషన్, ఫారెస్ట్, వెటర్నరీ తదితర అన్ని శాఖల అధికారులు తమ శాఖల పురోగతిని సమావేశంలో వివరించారు, అనంతరం ఎమ్మెల్యే జియంఆర్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించకుండా జవాబుదారీతనంతో చేస్తూ, ప్రభుత్వ పథకాల సంబంధించి సర్పంచులతో చర్చించి, సమన్వయంతో పని చేయాలి., ప్రజా ప్రతినిధులు గ్రామాలు, మండల కేంద్రాల్లో పరిశుభ్రత, పారిశుద్ధ్యం, మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సాధించాలి.ఉద్యానవన పంటలను ప్రోత్సహించి, రైతులకు ఉద్యానవన పంటల గురించి అవగాహన కల్పించి, ఉద్యాన పంటల సాగును మరింతగా పెంచేలా హార్టికల్చర్ అధికారులు పనిచేయాలి.

విద్య, వైద్యం, ఇరిగేషన్ శాఖలపై ప్రత్యేక దృష్టి పెట్టి మన ప్రభుత్వం పని చేస్తుంది.మదనపురం మండలంలో 90% ఇండ్లకు గృహ జ్యోతి కింద ఉచిత విద్యుత్ ఇస్తున్నం.గత ప్రభుత్వం మదనపురం మండలంలోని సరళసాగర్, నెల్విడి, కూరుమూర్తి రాయ ఎత్తిపోతల పథకాలను పట్టించుకోలే, మన ప్రభుత్వం ఎత్తిపోతల పథకాల మరమ్మత్తుల కోసం 5 కోట్లు మంజూరు చేసింది.అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే జియంఆర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# కరెంట్ షాకుకు పాడి గేద బలి



**టీ మీడియా, ఆగస్టు 3, ఆళ్లపల్లి :**
ఆళ్లపల్లి గ్రామంలోని రైతు మలిపెద్ది ప్రభాకర్ కు చెందిన పాడి గేద విద్యుత్ షాక్ తో మృతి చెందింది ఉదయం వేల వ్యవసాయ పొలంలోని ట్రాన్స్ఫార్మర్ వద్ద ఉన్న విద్యుత్ తీగను గేద తాగడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది జీవన ఆధారమైన గేద చనిపోవడంతో రైతు కుటుంబం తీవ్ర శోకసంద్రంలో మునిగిపోయింది పాడి గేద విలువ సుమారు 20,000 ఉంటుందని రైతు తెలిపారు.

# ప్రపంచ ఆదివాసి దినోత్సవ ఉద్యమ పిలుపు

**టీ మీడియా ,ఆగస్టు 3, ఆళ్లపల్లి :**
ఆళ్లపల్లి మండల కేంద్రంలో మర్కోడు గ్రామపంచాయతీ పరిధిలో గల పెద్దూరు గ్రామంలో శ్రీ కొమరం వారి ఇలవేల్పు శ్రీ రెక్కల రామక్క ఆలయ సన్నిధిలో మొక్కులు చెల్లించుకున్న తదనంతరం ఆదివాసీల తొమ్మిది తెగల సమన్వయకర్త చైర్మన్ చుంచు రామకృష్ణ మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన కులను కాపాడుకుందాం ఆదివాసుల ఆత్మ గౌరవం నిలబెట్టుకుందాం ఆగస్టు 9 ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా నిర్వహించే భద్రాది కొత్తగూడెం జిల్లాలో జరగనున్న మహాసభకు ఆదివాసి ప్రజలు యువత విద్యార్థులు మహిళలు ఉద్యోగులు, ప్రజాస్వామ్యవాదులు మేధవులు అందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ప్రయత్నిస్తున్నాం ప్రకృతి సంపదలపై ఆదివాసులు హక్కులను పరిరక్షించుకుందాం. ఐదవ షెడ్యూలు పిసా చట్టం అడవి హక్కుల చట్టాలను సంపూర్ణంగా అమలు చేయాలని ప్రభుత్వాలను డిమాండ్ చేద్దాం చట్టం భూమి అడివి నీటిపై ఆదివాసుల హక్కులను కాలరాసే ప్రతి ప్రయత్నాన్ని ఐక్యంగా పోరాడి హక్కులను సాధించుకుందాం ప్రపంచ ఆదివాసీ దినోత్సవశీను విజయవంతం చేద్దాం ఆళ్లపల్లి మండల కేంద్రం నుంచి పెద్ద ఎత్తున భద్రాద్రి కొత్తగూడెంలో జరగనున్న ప్రకాశం స్టేడియంలో జరగనున్న మహాసభకు అధిక సంఖ్యలో కదిలి రావాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పెండగట్ల పాపారావు ఏ డబ్ల్యు సి కార్యదర్శి. జోగే రాంబాబు అల్లపల్లి మండలం ఆదివాసి జేఏసీ మండల అధ్యక్షులు పాయం. రమేష్ పాయం. నర్సిహరావు కొమరం సతీష్ ఊకె ఎర్రయ్య ఇతరులు

## సుప్రీంకోర్టులో జడ్జిల సంఖ్య పెంపు బిల్లుకు లోక్సభ ఆమోదం

**టి మీడియా , ఆగస్టు 3 , ఢిల్లీ బ్యూరో :**
దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్యను పెంచే కీలక బిల్లుకు లోక్సభ సోమవారం ఆమోదం తెలిపింది. ప్రస్తుతం ఉన్న మొత్తం 34 మంది న్యాయమూర్తుల సంఖ్యను 38కు పెంచే ఉద్దేశంతో తీసుకొచ్చిన సుప్రీంకోర్టు (న్యాయమూర్తుల సంఖ్య) సవరణ బిల్లు-2026ను విపక్షాల తీవ్ర నిరసనల మధ్య ఎలాంటి చర్చ లేకుండానే మూజువాణి ఓటుతో సభ ఆమోదించింది. దీంతో ఈ ఏడాది మే నెలలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్కు చట్టబద్ధత కల్పించే ప్రక్రియలో కీలక ముందడుగు పడింది.

లోక్సభ సమావేశం ప్రారంభమైనప్పటి నుంచే ప్రతిపక్ష సభ్యులు నినాదాలతో సభా కార్యక్రమాలను అడ్డుకున్నారు. నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారం, అయోధ్య రామాలయంలో భక్తుల విరాళాల చోరీ ఆరోపణలు, విద్యార్థులపై పోలీసుల లాఠీఛార్జ్ వంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తూ విపక్ష సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. దీంతో ప్రశ్నోత్తరాల కార్యక్రమం సజావుగా సాగలేదు. పలుమార్లు సభను వాయిదా వేయాల్సి వచ్చింది. మధ్యాహ్నం అనంతరం సభ తిరిగి ప్రారంభమైనప్పటికీ పరిస్థితిలో మార్పు కనిపించలేదు. ప్రతిపక్ష సభ్యులు తమ స్థానాల్లోకి వెళ్లకుండా నినాదాలు కొనసాగించారు. ఈ పరిస్థితుల్లో కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య పెంపు బిల్లును సభలో ప్రవేశపెట్టి దాని ఉద్దేశాన్ని సంక్షిప్తంగా వివరించారు.

అనేకసార్లు విజ్ఞప్తి చేసినా!

అయితే స్పీకర్ సభ్యులను పలుమార్లు శాంతించాలని కోరారు. బిల్లుపై చర్చలో పాల్గొనాలని, సభా సంప్రదాయాలను గౌరవించాలని విజ్ఞప్తి చేశారు. అయితే విపక్ష సభ్యులు నిరసనలు కొనసాగించడంతో చర్చ జరగలేదు. అనంతరం బిల్లును మూజువాణి ఓటుకు పెట్టగా సభ ఆమోదం తెలిపింది. ఇదే సమయంలో ఆర్డినెన్స్ను వ్యతిరేకిస్తూ ప్రతిపక్షం తీసుకొచ్చిన చట్టబద్ధ తీర్మానాన్ని కూడా మూజువాణి ఓటుతో తిరస్కరించారు.

# కారేపల్లి సోసైటీకి ప్రహారీ గోడ పనుల ప్రారంభం

- **రూ.5 లక్షల నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌కు పాలకవర్గం కృతజ్ఞతలు**



**టీ మీడియా,ఆగస్ట్03,సింగరేణి(కారేపల్లి):**
కారేపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (సొసైటీ) చుట్టూ ప్రహారీ గోడ నిర్మాణ పనులను సోమవారం ఘనంగా ప్రారంభించారు.సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు,సింగరేణి గ్రామ సర్పంచ్ మేదరి వీరప్రతాప్ (టోనీ) కలిసి పనులకు శంకుస్థాపన చేశారు.ప్రహారీ గోడ నిర్మాణానికి తొలి విడతగా వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ తన నియోజకవర్గ ప్రత్యేక అభివృద్ధి నిధుల నుంచి రూ.5 లక్షలు మంజూరు చేయగా,గ్రామపంచాయతీ తీర్మానం అనంతరం నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి.ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు సొసైటీ పాలకవర్గం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది.ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ,రైతులకు నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యంగా సహకార సంఘం పనిచేస్తోందన్నారు.ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అందిస్తున్నామని తెలిపారు.రైతులకు మరింత ప్రయోజనం చేకూర్చేందుకు సొసైటీ అనుబంధంగా రైతు ఉత్పత్తిదారుల సంస్థ (ఎఫ్‌పీఓ)ను ఏర్పాటు చేశామని,రైతులు రూ.2 వేల సభ్యత్వ రుసుము చెల్లించి సభ్యులుగా చేరాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తోటకూరి రాంబాబు,సొసైటీ కార్యదర్శి బొల్లు హనుమంతరావు,ఉపసర్పంచ్ పెద్దమ్మ భాగ్యలక్ష్మి,డైరెక్టర్లు అడ్డగోడ ఐలయ్య,దేగల ఉపేందర్, వార్డు సభ్యురాలు అంకోలు విజయ,గ్రామ పెద్దలు పెద్దమ్మ సత్యం,కేలోత్ రవి,పెంద్ర నాగేష్,శంకర్,రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# కేజీబీవీలో సీటు కావాలంటే లంచం ఇవ్వాల్సిందే !?

- **బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు కురువ పల్లయ్య**




**టీ మీడియా,ఆగస్ట్3, గద్వాల :**
జోగులాంబ గద్వాల జిల్లాలోని ఐజ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో ఆరో తరగతి సీటు ఇవ్వాలంటే రూ.30 వేల లంచం డిమాండ్ చేస్తున్నారని ఆరోపిస్తూ బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు కురువ పల్లయ్య జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఈ మేరకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా కురువ పల్లయ్య మాట్లాడుతూ, నిరుపేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కుటుంబాల పిల్లలు కేజీబీవీల్లో చదివి మంచి భవిష్యత్తు సాధించాలని ఆశపడుతుంటే, సీటు కోసం డబ్బులు అడగడం దుర్మార్గమని విమర్శించారు. ఓ తండ్రి తన కుమార్తెకు ఆరో తరగతిలో ప్రవేశం కల్పించాలని ఐజ కేజీబీవీని సంప్రదించగా, రూ.30 వేల లంచం ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు ఆరోపించారు.ఈ ఆరోపణలపై జిల్లా కలెక్టర్ వెంటనే విచారణ జరిపించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.అలాగే జిల్లాలోని పలు కేజీబీవీల్లో నాణ్యమైన విద్య, భోజనం అందడం లేదని, విద్యార్థులు సమస్యలు ప్రస్తావిస్తే వారినే లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వం అందించాల్సిన పలు సౌకర్యాలు, వస్తువులు కూడా పూర్తిస్థాయిలో అందడం లేదని విద్యార్థులు తమకు ఫిర్యాదు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బండారి అభిషేక్, యునస్, వెంకటేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# బాధితులకు అండగా పీఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్

- **26 గ్రామాల్లో ఆర్థిక సాయం అందజేత**



**టి మీడియా, ఆగస్టు 3 ,తిరుమలాయపాలెం :**
తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సూచనల మేరకు తిరుమలాయపాలెం మండలంలో పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సాయం పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. జూలై 1 నుంచి జూలై 31 వరకు వివిధ కారణాలతో మరణించిన మొత్తం 60 కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ. 10,000 చొప్పున.. మొత్తం రూ. 6 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.మండల పరిధిలోని తిరుమలాయపాలెం, బాలాజీనగర్ తండా, పిండిప్రోలు, తెట్టెలపాడు, కేశవాపురం, తిప్పారెడ్డిగూడెం, అజ్మీరా తండా, జల్లెపల్లి, హైదర్‌సాయిపేట, పాతర్లపాడు, గోల్‌తండా, చంద్రుతండా, మేకలతండా, మేడిదపల్లి, మహ్మదాపురం, ఇస్లావత్‌తండా, రఘునాథపాలెం, కాకరవాయి, జూపెడ, రాజారం, బచ్చోడుతండా, బచ్చోడు, బీరోలు, ఏలువారిగూడెం, దమ్మాయిగూడెం, ఎర్రగడ్డ తండా మొత్తం 26 గ్రామాల్లో బాధితుల ఇళ్లకు వెళ్ళి కుటుంబ సభ్యులను పరామర్శించి ఈ సహాయాన్ని పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ... ప్రతి నెల క్రమం తప్పకుండా పీఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా బాధితులకు ఆర్థిక సాయం అందిస్తూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కొండంత అండగా నిలుస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, పొంగులేటి అభిమానులు పాల్గొన్నారు.

# అర్జీలను సత్వరమే పరిష్కరించాలి



- **జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్**

**టి మీడియా , ఆగస్టు 3 ,ఖమ్మం:**
ప్రజలు తమ సమస్యలు తెలిపి సమర్పించిన దరఖాస్తులను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ జిల్లా అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి లతో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు.ఖానాపురం హవేలీ శివారు టేకులపల్లికి చెందిన వి. వెంకటయ్య ఈ నెల తనకు వృద్ధాప్య పెన్షన్ డబ్బులు జమ కాలేదని తన బ్యాంకు ఖాతాలో ఆ డబ్బులు జమ చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, పీడీ డీఆర్డీఓ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.ఖమ్మం నగరం 44వ డివిజన్ లెనిన్ నగర్ కు చెందిన ఎస్.కే నాజియా తన కుమార్తె తలసేమియా వ్యాధితో బాధపడుతున్నా రని, తన కుమార్తె కు ఫించన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, పీడీ డీఆర్డీఓ, సెర్ప్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం అర్బన్ మండలం కొత్తూరు గ్రామానికి చెందిన ఎం. సూర్య ప్రకాష్ పాపిరెడ్డి ఖమ్మం దేవరపల్లి హైవే ధంసలాపురం ఎంట్రీ ఎగ్జిట్ వద్ద ఉన్న తమ భూమికి దారి ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, పీడి ఎన్. హెచ్ అధికారులకు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.నేలకొండపల్లి మండలం నాచేపల్లి గ్రామానికి చెందిన వి. రామకృష్ణ తాను పి.జీ చదువుకున్నానని తనకు కంటికి సంబంధించిన దివ్యాంగత్వం ఉందని, తనకు ఏదైనా ఉపాధి చూపించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా ఉపాధి అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.ప్రజావాణి కార్యక్రమంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పరాస్ కుమార్, డిఆర్ఓ సిహెచ్ రామ్మూర్తి, జెడ్పీ సిఈఓ దీక్షా రైనా, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాస్, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# టైగర్ జోన్ ఆంక్షలపై ఎమ్మెల్యే ఆగ్రహం




- **ఆంక్షలు ఎత్తేయాలి**

**టీ మీడియా,ఆగస్ట్3,జన్నారం:**
ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కవ్వాల్ టైగర్ జోన్ పరిధిలో అమలవుతున్న ఆంక్షలను సడలించకపోతే అటవీ అధికారులపై సహాయ నిరాకరణ ఉద్యమం చేపడతామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ హెచ్చరించారు. అటవీ అధికారులకు నిత్యావసర సరుకులు ఎవరూ అందించవద్దని, ఆదివాసీల సహాయ నిరాకరణ ఉద్యమానికి ప్రజలంతా సహకరించాలని పిలుపునిచ్చారు.సోమవారం రాత్రి మంచిర్యాల జిల్లా జన్నారం మండల కేంద్రంలోని హరిత రిసార్ట్‌లో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. కొందరు అటవీ అధికారులు అభివృద్ధికి అడ్డుపడు తున్నారని ఆరోపించారు. మంచిర్యాల సీఎఫ్, ఎఫ్‌డీపీటీ శాంతారాంతో పాటు మరికొందరు అటవీ అధికారులు ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఇందనపల్లి నాయకపుగూడకు చెందిన ఆరుగురు ఆదివాసీ యువకులపై దాడి చేసిన ఇందనపల్లి ఇన్‌చార్జి ఫారెస్ట్ రేంజ్ అధికారి లక్ష్మీనారాయణను 24 గంటల్లో సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆదివాసీల సహాయ నిరాకరణ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.తాను ప్రభుత్వానికి వ్యతిరేకి కాదని, అటవీ శాఖలోని కొందరు అధికారుల తీరును మాత్రమే వ్యతిరేకిస్తున్నానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఉద్యమాల నుంచి వచ్చిన వ్యక్తినని, ప్రజల పక్షాన చివరివరకు పోరాడతానని అన్నారు. 24 గంటల గడువు ముగిసిన తర్వాత ప్రజల ప్రయోజనాల కోసం మరింత కఠిన నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు.ఈ సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అజ్మీర నందు నాయక్, ప్రధాన కార్యదర్శి మాణిక్యం, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎర్ర చంద్రశేఖర్, జిల్లా నాయకులు మోహన్ రెడ్డి, ఇసాక్, ముజాఫర్, వడ్డెర సంఘం మండల అధ్యక్షుడు బొంతల లక్ష్మణ్, శంకరయ్య, భూమేష్, లక్ష్మణ్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# రామయ్యకు కలర్ ప్రింటర్లు విరాళం




**టి మీడియా , ఆగస్టు 3 , భద్రాచలం:**
భద్రాచల శ్రీ సీతారామచంద్రస్వామివారిపై భక్తి, కృతజ్ఞతాభావంతో రాజమండ్రికి చెందిన వీర బ్రహ్మానంద స్వామి సోమవారం దేవస్థానానికి రెండు కలర్ ప్రింటర్లను విరాళంగా అందజేశారు. దేవస్థానం ఈవో దామోదరరావు కి ఈ ప్రింటర్లను అప్పగించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సాయిబాబా ఆలయకోశాధికారి గొర్ల వెంకటేశ్వరరావు, ప్రముఖ సమాజ సేవకుడు కడాలి నాగరాజు, పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన స్నేహితులు వెంకటేశ్వర, కడాలి నాగరాజు మాట్లాడుతూ గత మే 9 న శ్రీసీతారామచంద్రస్వామివారి దర్శనానికి వచ్చిన సమయంలో వీర బ్రహ్మానంద స్వామి రూ.3.5 లక్షల విలువైన బంగారు బ్రాస్లెట్‌ను రామాలయంలో పోగొట్టుకున్నారని తెలిపారు. ఆ బ్రాస్లెట్ కొత్తగూడెంకు చెందిన వెంకటేశ్వర్లుకు దొరకగా, భద్రాచలానికి చెందిన గొర్ల వెంకటేశ్వరరావు సహకారంతో దేవస్థానం అధికారులకు అప్పగించారని చెప్పారు. అనంతరం దేవస్థానం అధికారులు బ్రాస్లెట్ యజమానిని గుర్తించి భద్రంగా తిరిగి అందజేశారని వివరించారు.తనకు ఎంతో విలువైన బంగారు బ్రాస్లెట్ తిరిగి దొరకడం స్వామివారి అనుగ్రహంగా భావించిన వీర బ్రహ్మానంద స్వామి, ఆ కృతజ్ఞతకు గుర్తుగా దేవస్థానానికి రెండు కలర్ ప్రింటర్లను విరాళంగా అందజేశారని వారు తెలిపారు.

# అర్హతలేని 'పోలీస్' కోచింగ్ సెంటర్లు



- **అధిక ఫీజు వసూలుతో కుచ్చుటోపీ**

**టి మీడియా , ఆగస్టు 3 , హైదరాబాద్ బ్యూరో :**
పోలీస్ కోచింగ్ పేరుతో కొన్ని అనధికార, ప్రైవేట్ అకాడమీలు నిరుద్యోగుల ఆశలను ఆసరాగా చేసుకుని భారీగా డబ్బులు వసూలు చేస్తూ మోసాలకు పాల్పడుతున్నాయి. శిక్షణ పొందేందుకు వచ్చే నిరుద్యోగులకు నకిలీ అకాడమీలు గాలం వేస్తున్నాయి. సరైన వసతులు, నిపుణులైన ఫ్యాకల్టీ లేకుండా ప్రకటనలు గుప్పిస్తూ మోసాలకు పాల్పడుతు న్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. భారీ ప్రకటనలు ఇచ్చి నిరుద్యోగులను ఆకర్షించి వేల రూపాయాలు వసూలు చేస్తున్నాయి. నగరంలో అనేక అకాడమీలు పోలీస్ కోచింగ్ పేరిట అధికంగా ఫీజులు వసూల్ చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారని అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. . కనీస నిబంధనలు, ఎలాంటి అర్హత లేకుండా అకాడమీలను నిర్వహిస్తున్నారు.రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్ల ద్వారా నిర్వహించాల్సిన అకాడమీ సెంటర్లు డ్యూటీలో ఉంటున్నవారే ఉచిత సేవ చేయకుండా డబ్బులు తీసుకుని మరీ కోచింగ్ సెంటర్లు నడిపించడంపై మండిపడుతున్నారు. నాణ్యతలేని బోధన, అనుభవంలేని అధ్యాపకులతో నామమాత్రపు తరగతులు నిర్వహిస్తూ నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. వంద శాతం ఉద్యోగం ఇస్తామంటూ నకిలీ వాగ్దానాలు చేయడం, తప్పుడు హామీలు ఇచ్చి అకాడమీలు నిరుద్యోగుల నుంచి సొమ్ము చేసుకుంటున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం 7 వేల పోస్టులతో పోలీస్ నోటిఫికేషన్ ఇవ్వడంతో అకాడమీ నిర్వాహకుల పంట పండినట్లుగా భావిస్తున్నారు. ఎలాగైనా ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో ఊరి నుంచి నగరానికి వస్తున్న నిరుద్యోగులు అకాడమీల పేరుతో మోసం చేసే కేసుల నిర్వాహకుల వలలో పడుతున్నారు. పలువురు నిర్వాహకులపై పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదవుతున్నాయని బహిరంగంగా చర్చించుకుంటున్నారు.